క్లుప్తంగా...

నియామకం



శ్రీనివాస్‌గుప్తాను సత్కరిస్తున్న ఎన్‌ఆర్.లక్ష్మణ్‌రావు తదితరులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ ఆటోపార్ట్స్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గుప్తా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం రాంకోఠిలో శ్రీనివాస్‌గుప్తాను తెలంగాణ రాష్ట్ర బజరంగ్‌సేనా అధ్యక్షుడు ఎస్.ఆర్.లక్ష్మణ్‌రావు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఆటోపార్ట్స్ అసోసియేషన్ వ్యాపారులు అభివృద్ధి, భద్రతతో పాటు సమాజ సేవా కార్యక్రమాలను నిర్వర్తిస్తుందని ఆయన తెలిపారు. శ్రీరామోజు రజిని, సూర్యశుక్లా, వికాస్ సింగ్, మనోజ్, నందు, ప్రవీణ్ యాదవ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్‌గా వెంకన్న



బాధ్యతలు స్వీకరించిన వెంకన్న

చాంద్రాయణగుట్ట: జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ నూతన జోనల్ కమిషనర్‌గా వెంకన్న సోమవారం సాయంత్రం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ జడ్సీగా విధులు నిర్వహించిన సామ్రాట్ అశోక్ సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్‌గా బదిలీ కావడంతో ఆయన స్థానంలో శేరిలింగంపల్లి సర్కిల్ డీసీగా విధులు నిర్వహిస్తున్న వెంకన్నను జోనల్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు స్వీకరించిన వెంకన్నకు జోనల్ సామ్రాట్ అశోక్‌తో పాటు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

కొనసాగుతున్న శతచండీ మహా యాగం



పూజల్లో పాల్గొన్న అట్లూరి శ్రీనివాసరావు ఆశా దంపతులు

చార్మినార్: బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో 22 రోజుల పాటు జరుగుతున్న రుద్ర సహిత శతచండీ మహా యాగం పూజా కార్యక్రమంలో కూకట్‌పల్లికి చెందిన ప్రముఖ వ్యాపారి అట్లూరి శ్రీనివాస రావు ఆశా దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి కాట రమేష్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించారు. ఈనెల 14వ తేదీ వరకు మహా యాగం కొనసాగుతుందని ఆయన తెలిపారు.

అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సామ సుందర్‌రెడ్డి

గౌలిపురా: బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం గౌలిపురాలోని భరత మాత, కోట మైసమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ కోశాధికారి బొడ్డు సాయిబాబా, నల్లింగ్ దేవేందర్, ఠాకూర్ అభిషేక్ సింగ్, ముఠా విక్కీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి బీఆర్‌ఎస్ యాకుత్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి సామ సుందర్‌రెడ్డి పాల్గొని అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ ఎర్మని కైలాష్ గంగపుత్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్.ఆనంద్ రావు, ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్‌రాజ్, సలహాదారులు పాశం సురేందర్, ఆలే జితేంద్ర, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, మధుసూదన్ గిరి, ఉపాధ్యక్షులు బి.వై.శ్రీకాంత్ పాల్గొన్నారు.

పంప్ హౌస్ పనులు ప్రారంభం

గోల్కొండ: బోజగుట్టలోని శ్రీరామ్‌నగర్‌లో సోమవారం పంప్‌హౌస్ పనులు ప్రారంభమయ్యాయి. బీజేపీ నాయకుడు దేవర వంశీ ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివేకానందనగర్, బోజగుట్ట బస్తీల వారు సమస్యలతో సహవాసం చేస్తున్నారన్నారు. ఈ పంప్ హౌస్ నిర్మాణ పనులు సాధ్యమైనంత త్వరలో పూర్తి చేయిస్తానన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



వేడుకల్లో జస్టిస్ రామలింగేశ్వర్‌రావు తదితరులు



గుడిమల్కాపూర్ సాయిబాబా ఆలయంలో..



బేగంబజార్‌లో.. ఆశీష్‌కుమార్‌యాదవ్



పూజల్లో దక్షిణ మండలం అదనపు డీసీపీ ఆనంద్ తదితరులు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ప్రత్యేక పూజలు.. అభిషేకాలు
- ఆధ్యాత్మికతతో సందడిగా ఆలయ పరిసరాలు

అబిడ్స్: గురుపౌర్ణమి వేడుకలు పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచే పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గుడిమల్కాపూర్ సాయిబాబా ఆలయం, దారుసలాం, ధూల్‌పేట్ సాయిబాబా ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బేగంబజార్‌లో జరిగిన గురుపూర్ణిమా వేడుకల్లో గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్ పాల్గొని పూజలు చేశారు.

అబిడ్స్‌లో..

గురుపూర్ణిమ వేడుకలను పురస్కరించుకుని బాబూ జగ్జీవన్‌రామ్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కొమ్ముల నరేందర్ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

జియాగూడలో..

జియాగూడ: గురుపౌర్ణమిని పురస్కరించుకుని జియాగూడ శాంతినగర్ శ్రీ శ్లోకా ది స్కూల్‌లో ప్రిన్సిపాల్ ఎం.నాగేశ్వర్ ఆధ్వర్యంలో మానవ సేవాయే మాధవ సేవా అనే అంశంపై 290 మంది విద్యార్థులు ఎస్సే రైటింగ్ పోటీల్లో పాల్గొనగా 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులకు మొదటి, ద్వితీయ, తృతీయ స్థానంలో గెలుపొందారు. అనంతరం గురువులైన నాగేశ్వర్, అమితా చరణ్, జయ, తిరుమలరావును శ్రీ సత్యసాయి సేవా భజన వింగ్ సేవా కన్వీనర్ నాగేశ్వర్, కో కన్వీనర్ పాటిల్‌లు వారిని ఘనంగా సత్కరించి సన్మానించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు.

బీఆర్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో..

విజయనగర్‌కాలనీ: గురుపూర్ణిమ పూజల్లో భాగంగా ఆసిఫ్‌నగర్ డివిజన్‌లో ఓం గురుదత్తా ఎంటర్‌ప్రైజెస్ సంస్థ నిర్వాహకులు నాగరాజు, శేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నాంపల్లి బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ ఆనంద్‌కుమార్‌గౌడ్, అశ్విన్‌మార్గం, ప్రదీప్ అగర్వాల్, ధరమ్‌వీర్ సింగ్, లక్ష్మీనారాయణ, బాల్‌చందర్, రేణేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

రాజన్నబావి వద్ద..

చార్మినార్: రాజన్నబావి వద్ద ఉన్న భవానీశంకర ఆలయంలో జరిగిన గురు పౌర్ణమి పూజా కార్యక్రమంలో దక్షిణ మండలం అదనపు డీసీపీ ఆనంద్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్టు ప్రతినిధులతో పాటు షాలీమార్ చానల్ కృష్ణా పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్‌లో..

గోల్కొండ: గుడిమల్కాపూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో గురుపూర్ణిమ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సాయిబాబా చిత్రపటానికి పూలమలలు వేశారు. అదే విధంగా దివంగత గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. యాదగిరి, అశ్విన్, శ్రీకాంత్‌సాగర్, నాగరాజు, ఈశ్వర్ జోషి, రాధాకిషన్‌యాదవ్ ఉన్నారు.

యోగాతో ఎంతో మేలు..

ప్రతిఒక్కరూ యోగా ఆచరించాలని ప్రముఖ యోగా గురువు ఈశ్వర్ జోషి అన్నారు. సోమవారం మెహిదీపట్నం పార్కులో ఆయన ఆధ్వర్యంలో గురుపూర్ణిమ వేడుకలు నిర్వహించారు. రవి, శ్రీకాంత్, ప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు.

సైఫాబాద్‌లో..

గన్‌ఫౌండ్రీ: మానవత్వం ఒక్కటే మానవ జాతికి సహజత్వం కావాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వరరావు అన్నారు. సోమవారం సైఫాబాద్‌లోని వాసవి కల్యాణ మండపంలో స్ఫూర్తి కుటుంబం తెలంగాణ ట్రస్టు ఆధ్వర్యంలో గురుపూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువులు ఒక శక్తి రూపమని గురువులను గౌరవించుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ప్రముఖ సాహితీ వేత్త ఓలేటి పార్వతీశం, రచయిత్రి శైలజ మిత్ర, స్ఫూర్తి కుటుంబం సభ్యులు పాల్గొన్నారు.

బేగంబజార్‌లో జోరుగా శోభాయాత్ర

బేగంబజార్‌లో గురుపూర్ణిమ వేడుకలను పురస్కరించుకుని పెద్ద ఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. పల్లకీలో వ్యాస మహారాజ్‌ను ఊరేగిస్తూ శోభాయాత్ర చేపట్టారు. గోషామహల్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ ముందుగా శోభాయాత్రను ప్రారంభించారు. బేగంబజార్‌లో ప్రారంభమైన శోభాయాత్ర ఫీల్‌ఖానా, పంచాయితీబాడ, గోషామహల్ రోడ్డు, ఛత్రి తదితర ప్రాంతాల్లో చేపట్టారు. ఈ సందర్భంగా నందకిశోర్ వ్యాస్ బిలాల్ పలువురు సాధువులను, పలువురు గురువులను ఘనంగా సత్కరించారు.



శోభాయాత్రలో బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్



విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న దృశ్యం



పూజలు నిర్వహించిన బాబు జగ్జీవన్‌రామ్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ కొమ్ముల నరేందర్



ఆసిఫ్‌నగర్‌లో ఆనంద్‌కుమార్‌గౌడ్‌ను సత్కరిస్తున్న నాయకులు



వేడుకల్లో దేవర వంశీ తదితరులు

6న నృత్య రూపకం

నాంపల్లి: బసవ సంక్షేమ సమితి, రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం, రాష్ట్రీయ బసవదళ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జూలై 6న సాయంత్రం 6 గంటలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో 'తుమ్హారే సివ ఔర్ కోయినహీ' అనే హిందీ నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తున్నట్లు బసవ సంక్షేమ సమితి అధ్యక్షుడు కల్వ మల్లికార్జునప్ప ఓ ప్రకటనలో తెలిపారు. 38 బసవ వచనములతో కూడిన ఈ రూపకాన్ని స్నేహ కప్పన్న దర్శకత్వంలో సి.అశ్వత్ సంగీత దర్శకత్వంలో కో ఆర్డినేటర్ వై.డి. బదామి నిర్దేశనంతో ప్రదర్శించనున్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తర్లబాలు జగద్గురు శాఖ మఠం పట్టాధ్యక్షులు, పండితారాధ్య శివచార్య స్వామిజీ, పశ్చిమాద్రి సంస్థాన్ విరాక్త మఠం పూజ్యశ్రీ పంచమ సిద్ధలింగ మహాస్వామిజీ అతిథులుగా పాల్గొంటారని మల్లికార్జునప్ప తెలిపారు.

క్రీడాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



అబిడ్స్: క్రీడాకారుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకురాలు, నగర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ మమతా గుప్తా పేర్కొన్నారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందన్నారు. సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్బీస్టేడియంలో జరిగిన హైదరాబాద్ ప్రీమియర్ లీగ్ ఫైనల్ పోటీలో ఆమె పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే క్రీడాకారులకు అన్నివిధాల సహాయ సహకారాలు అందుతున్నాయన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో క్రీడాకారులు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సహకారంతో పరిష్కరించేందుకు కృషిచేస్తానని మమతాగుప్తా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు గోవింద్‌రాఠి, సంతోష్‌గుప్తా, నితిన్ నందకర్, వినోద్‌యాదవ్, మాణిక్‌రావు పాల్గొన్నారు.


ఆరోగ్య తెలంగాణ దిశగా డీహెచ్ శ్రీనివాసరావు కృషి



డీహెచ్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్రంలో వైద్య శాఖలో అధికారులు, ఉద్యోగులతో కలిసి ఆరోగ్య తెలంగాణను అందించే దిశగా హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు కృషి చేస్తున్నారని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఖలీమ్‌ఉద్దీన్ అహ్మద్ అన్నారు. ఈ మేరకు సోమవారం కోఠి డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో డీహెచ్ శ్రీనివాస్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖలో ఉన్న సమస్యలను డీహెచ్ శ్రీనివాసరావు తీర్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ రామాంజనేయులు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, ప్రభాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మహిపాల్, మంజుల, స్వరూప, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి



ముజీబ్ హుస్సేనికి పెండింగ్ బిల్స్ సమాచార పత్రాలను అందజేస్తున్న రాజు తదితరులు

సుల్తాన్‌బజార్: ఈఎన్‌టీ ఆస్పత్రి ఉద్యోగుల పెండింగ్ బిల్లును విడుదల చేయాలని టీఎన్జీఓస్ యూనిట్ ఆస్పత్రి యూనిట్ అధ్యక్షుడు తూంకుంట రాజు కోరారు. ఈ మేరకు సోమవారం టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేనికి పెండింగ్ బిల్స్ సమాచారంతో కూడిన పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్తానని ముజీబ్ హుస్సేని హామీ ఇచ్చారు. యూనిట్ కార్యదర్శి రాజేందర్, నిర్వహణ అధికారి సంతోష్, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. చందులాల్ బారాదరి, ప్రిన్స్ కాలనీ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు. రామ్నాస్‌పురా, మోచీ కాలనీ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు. బిలాల్‌నగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలో..

విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. మేథర్‌వాడీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

మహా శివుడి విగ్రహ ఏర్పాటుకు అనుమతించాలి



ఈఓకు వినతిపత్రం అందజేస్తున్న సేవా సమితి ప్రతినిధులు

జియాగూడ: కిషన్‌బాగ్ కాశిబుగ్గ ఆలయంలో 21 అడుగుల మహా శివుడి విగ్రహం ఏర్పాటుకు అనుమతించాలని దేవాదాయశాఖకు వినతిపత్రం అందజేసినట్లు ఆలయ సేవా సమితి ప్రతినిధులు బాబురావు, ఓంసింగ్, అనిల్, అర్జున్ థాక్రే పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆలయ ప్రాంగణంలో ప్రభుత్వ దేవాదాయశాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి శ్రీనివాస్ శర్మ, టెంపుల్ క్లర్క్ యోగేష్‌కు సమితి ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విగ్రహ ఏర్పాటు నిర్మాణానికి బేగంబజార్‌కు చెందిన పహాడివాలే మహేష్ యాదవ్ ముందుకు వచ్చారన్నారు.

సేవ చేసే వారికి గుర్తింపు



రాజు వస్తాద్‌ను సన్మానిస్తున్న సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ ఖరే

గోల్కొండ: సమాజ సేవే చేసే వారికి సంఘంలో గుర్తింపు లభిస్తుందని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ ఖరే అన్నారు. గోల్కొండ బోనాల ఉత్సవాల్లో విశేష సేవలు అందించిన గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ చైర్మన్ ఎస్. రాజు వస్తాద్‌ను సోమవారం ఆయన గోల్కొండ కోటలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోల్కొండ కోట బోనాలు భారీ సంఖ్యలో భక్తులు తరలి వస్తారని, తాము బందోబస్తును అంతే స్థాయిలో చేపడుతామన్నారు. అయితే గోల్కొండ కోటలో బోనాలు కానీ, దసరా సమ్మేళనాలు ఏం జరిగినా కూడా పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల సహాయ సహకారాలు తమకు అందుతున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, మైత్రి కమిటీ సభ్యులు ఇలియాస్ అలీ, మీర్జా అహ్మద్ బేగ్, ఆబిద్, ఆజమ్ ఖాన్, హమీద్ ఉద్దీన్ తహసీన్, జంగయ్య, శ్రీను తదితరులున్నారు.

ట్రాన్స్‌కో ఉద్యోగిపై దాడి

విజయనగర్‌కాలనీ: విధుల్లో ఉన్న ట్రాన్స్‌కో ఉద్యోగిపై కొందరు వ్యక్తులు దాడిచేసిన ఘటన సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. టపాచబుత్ర పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుంకరి శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. దత్తాత్రేయనగర్ ట్రాన్స్‌కో సెక్షన్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి గత శుక్రవారం టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహబూబ్ కాలనీలో విధులు నిర్వహిస్తుండగా కొందరు వ్యక్తులు అకస్మాత్తుగా వచ్చి దాడిచేశారు. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించిన అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటివరకు తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఆ ఆలయాలను చాంద్రాయణగుట్ట పరిధిలోనే ఉంచాలి



హోంమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చాంద్రాయణగుట్ట: కేశవగిరిలోని ప్రాచీనమైన ఆలయాలను చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోనే కొనసాగించేలా చూడాలని బీఆర్‌ఎస్ నాయకులు హోం మంత్రి మహమూద్ అలీకి విన్నవించారు. ఈ మేరకు సోమవారం వారు హోం మంత్రిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కేశవగిరిలోని చెన్నకేశవ స్వామి ఆలయం, రామాలయం, సంతోషిమాత ఆలయం, మల్లన్న స్వామి ఆలయాలను రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి తీసుకురావడం భద్రతాపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ హైదరాబాద్ కాంటెస్టెడ్ ఎంపీ పుస్తె శ్రీకాంత్, నాయకులు జుర్కీ రాజేందర్, ఆకుల శ్రీనివాస్, దిలీప్‌కుమార్, పవన్‌రెడ్డి, ఫజల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలను అభివృద్ధి చేస్తాం

గన్‌ఫౌండ్రీ: సీఎం కేసీఆర్ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ అన్నారు. సోమవారం రవీంద్ర భారతిలో మహంకాళి మహేష్‌గౌడ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాల్లో విశిష్ట సేవలందిస్తున్న పలువురికి బోనాల ఉత్సవ్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోనాల పండగ తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతీక అని తెలిపారు. సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞ శర్మ, మహంకాళి ఆలయ చైర్మన్ రాజేందర్‌యాదవ్, ట్రస్ట్ అధ్యక్షులు అరవింద్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, వైస్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

సాయిబాబాకు ఉత్తమ సేవా అవార్డు..

గోల్కొండ: దశాబ్దాలుగా గోల్కొండ మహంకాళి అమ్మవారికి సేవ చేస్తున్న బొమ్మల సాయిబాబాచారి తన కార్యదీక్షతతో అమ్మవార్ల వృత్తిపని వార్లకు ఆదర్శంగా నిలిచారని మహంకాళి మహేష్ గౌడ్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గోవింద సత్యనారాయణ అన్నారు. వృత్తి పని సంఘం అధ్యక్షుడిగా ఉత్తమ సేవలు అందిస్తున్న ఆయనకు విశిష్ట సేవా పురస్కారాన్ని సోమవారం ప్రదానం చేశారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్ గౌడ్, సంఘం అధ్యక్షుడు అరవింద్‌కుమార్‌గౌడ్, దైవాజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు.



సాయిబాబాను సత్కరిస్తున్న దృశ్యం



పలువురు ప్రతినిధులను సన్మానిస్తున్న బండా ప్రకాష్

పేదలకు 'డబుల్' ఇళ్లను కేటాయించాలి



మాట్లాడుతున్న ఈశ్వర్‌రావు

చాంద్రాయణగుట్ట: పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే కేటాయించాలని సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌రావు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల (సీఐటీయూ, ఐద్వా, గిరిజన, ఆవాజ్, డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో చాంద్రాయణగుట్ట ఫూల్‌బాగ్‌లోని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ కార్యాలయం ముందు సోమవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌రావు మాట్లాడుతూ..ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. 2016లో డబుల్ ఇళ్ల కోసం చేసుకున్న దరఖాస్తులను విచారించినప్పటికీ.. లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను కేటాయించడం లేదన్నారు. బాలు, శశికళ, మీనా, నాగేశ్వర్ రావు, కోటయ్య, జంగయ్య, లక్ష్మమ్మ, స్వామి, జీవన్, ఫర్జానా, కిషన్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే బీజేపీ ధ్యేయం



జియాగూడ: పేదల సంక్షేమమే ధ్యేయంగా బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందని బీజేపీ కేరళ రాష్ట్రానికి చెందిన ప్రతినిధులు అఖిల్‌లాల్, సుస్మిత అన్నారు. ఈ మేరకు సోమవారం జియాగూడ, సబ్జిమండి, నవోదయ గంగానగర్, డోర్‌బస్తీ తదితర ప్రాంతాల్లో లబ్ధిదారులు సాధించిన ఆర్థిక ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గోల్కొండ జిల్లా డైరీ ఫారం సెల్ కన్వీనర్ శివకుమార్‌యాదవ్, డివిజన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. జియాగూడలో గరీబ్ కల్యాణ్ అన్న యోజన, ఆవాస్ యోజన, జన్‌ధన్ ఖాతాలు తెరిపించడం, స్వనిధి యోజన ఆయుష్మాన్ భారత్, జన ఔషధి తదితర ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిరుపేదలకు బాసటగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో గుర్రం శివశంకర్, రాజ్‌పాల్ పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684